



నేతన్నకు.. రుణ విముక్తి!

- చేనేత రుణమాఫీకి ప్రభుత్వం నిర్ణయం
- రూ.లక్ష లోపు మాఫీ చేస్తూ ఉత్తర్వులు
- జిల్లాలో రూ.3.48కోట్లు మాఫీ
- 817 మందికి చేనేత కార్మికులకు లబ్ధి
- ఇప్పటికే రుణం చెల్లించిన వారికీ వర్తింపు
- సర్కారు జీవోతో ఆనందం

జనగామ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు రేవంత్ ప్రభుత్వం తీపి కబురు అందించింది. గతంలో ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికులు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. చేనేత రుణాలకు సంబంధించి గతంలోనే సీఎం హామీ ఇవ్వగా తాజాగా రుణమాఫీకి సంబంధించి రూ.33కోట్లను విడుదల చేస్తూ ఇటీవల జీవో తీసుకొచ్చింది. దాంతో చేనేత కార్మికుల ఏళ్ల నిరీక్షణకు తెరపడనుంది. జిల్లాలో 817మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరనుండగా, రూ.3.48 కోట్ల మేర రుణాలు మాఫీ కానుంది. ఈనెల 9న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో నేతన్నల్లో హర్షం వ్యక్తమవుతోంది.

● రూ.లక్ష లోపు రుణ మాఫీ..

చేనేత రుణమాఫీలో భాగంగా రూ.లక్ష రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుంది. కార్మికులు వ్యక్తిగతంగా, సొసైటీల ద్వారా రుణాలు పొందగా కేవలం వ్యక్తిగతంగా తీసుకున్న రుణాలను మాత్రమే ప్రభుత్వం మాఫీ చేయనుంది. బీఆర్ఎస్ హయాంలో 2017మార్చి లోపు ఉన్న రుణాలు మాఫీ కాగా.. ప్రస్తుతం 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు తీసుకున్న రుణాలను మాఫీ కానున్నాయి. కార్మికుడికి వ్యక్తిగతంగా ఎంత రుణం ఉన్నా రూ.లక్ష వరకు మాఫీ కానుంది. మాఫీ కసరత్తును ప్రభుత్వం మూడు నెలల క్రితమే ప్రారంభించింది. గత ఏడాది సెప్టెంబరు 9న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. గత డిసెంబరులో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి చేనేత రుణాలకు సంబంధించిన వివరా లను తెప్పించుకున్నారు. జిల్లాల వారీగా చేనేత కార్మికులు తీసుకున్న రుణాలు ఎంత? లబ్ధికి ఎంత మంది అర్హులన్న వివరాలను ఉన్నతాధికారులు సేకరించారు. తక్కువ మొత్తంలోనే రుణాలు ఉండడంతో మాఫీ అమలుకు ప్రభుత్వం జీవో జారీ చేసింది.

● రూ.3.48 కోట్లు మాఫీ..

జిల్లావ్యాప్తంగా 817 మందికి రుణమాఫీ కానుంది. జిల్లాలో 817 మంది చేనేత కార్మికులు వ్యక్తిగతంగా రుణాలు తీసుకున్నారు. వీరిలో రూ.లక్ష లోపు ఉన్నవారు, రూ.లక్ష పైబడి ఉన్నవారు ఉన్నారు. లక్ష వరకే మాఫీ చేస్తుండడంతో 817 మందికి లబ్ధి చేకూరనుంది. ఆ పైబడి ఉన్న రుణాన్ని వారు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా 12 మండలాల పరిధిలో సుమారు 3వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. జనగామతోపాటు బచ్చన్నపేట, కొడకండ్ల మండలాల్లో చేనేత కార్మికులు అధికంగా ఉంటారు. చేనేత వృత్తి నమ్ముకొని జిల్లాలో వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

● రుణమాఫీపై హర్షం

చేనేత రుణమాఫీ నిర్ణయంపై చేనేత కార్మికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2010 నుంచి 2017 మార్చి వరకు తీసుకున్న చేనేత రుణాలను మాఫీ చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి రాగానే చేనేత రుణాలను మాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి అప్పట్లో హామీ ఇచ్చారు. దాంతో 2017 ఏప్రిల్ 1 నుంచి 2024మార్చి 31 వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో ఏళ్ల నుంచి ఎదురుచూపులకు తెరపడినట్టయింది. 2017 ఏప్రిల్ 1 తర్వాత రుణాలు తీసుకున్న వారిలో కొంతమంది తిరిగి చెల్లించారు. దీనితో తమకు రుణమాఫీ వర్తిస్తుందో లేదోనని, అనవసరంగా చెల్లించామన్న భావనలో ఉండిపోయారు. దీంతో ప్రభుత్వం తిరిగి చెల్లించిన వారికి సైతం రుణమాఫీ వర్తింపచేస్తామని ప్రకటించడం విశేషం.

రూ.3.48కోట్ల రుణాలు మాఫీ

-చి.చౌడేశ్వరి, అసిస్టెంట్ డైరెక్టర్, చేనేత, జౌళి శాఖ, జనగామ.



చేనేత రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 మధ్య తీసుకున్న రుణాలు మాఫీ కానున్నాయి. జిల్లాలో 817 మందికి సంబంధించి రూ.లక్ష వరకు రుణాలు మాఫీ అవుతాయి. రుణమాఫీ కింద రూ.3.48 కోట్ల మేర సర్కారు నిధులు విడుదల చేయనుంది.

పరీక్షలకు సమాయత్తమవ్వాలి

- పరీక్షలంటే భయం వీడాలి..
- టెన్త్‌లో టాపర్ విద్యార్థులకు బహుమానాలు
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ధర్మకంచ కళాశాలలో ఇంటర్ పరీక్షను పరిశీలిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు సమాయత్తం కావాలని, టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పేర్కొన్నారు ఈనెల 21నుంచి పదవ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా జూమ్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు ప్రతీ విద్యార్థి హాజరయ్యేలా చూడాలని, పరీక్షలంటే భయం వీడాలని సూచించారు. పరీక్షల వేళ తగినంత వ్యాయామం, మంచి పోషకాహారం, తగినంత నిద్ర ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. ప్రతీ మండలం నుంచి టాపర్‌కు, జిల్లా టాపర్‌కు సైకిల్‌ను బహుమానంగా ఇస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు, బహుమానాలు ఉంటాయన్నారు. 100% ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు ప్రత్యేక అవార్డులు ప్రకటిస్తామని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీఈవో రమేశ్, ఏసీజీ రవికుమార్, జీసీడీవో గౌసియా బేగం పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షల సరళి పరిశీలన

జనగామలోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల సరళిని సోమవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. విద్యార్థుల హాజరుపై ఆరా చేసి, కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. తాగునీటి వసతి, మెడికల్ సిబ్బంది మూత్రశాలలు అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో డీఐఈవో జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటిని విడుదల చేయండి..

బొమ్మకూరు రిజర్వాయర్ వద్ద రైతుల ధర్నా



బొమ్మకూరు రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

నర్మెట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని లద్నూరు రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయాలని కోరుతూ సోమవారం లద్నూరు, ధర్మారం రైతులు నర్మెట మండలంలోని బొమ్మకూరు రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద ధర్నా చేశారు. రైతులు మాట్లాడుతూ దేవాదుల నీటిని నమ్ముకునే లద్నూరుతో చుట్టూ పక్కల గ్రామాల రైతులు వందల ఎకరాల్లో వరి సాగు చేశారని, లద్నూరు రిజర్వాయర్‌లో నీళ్లు లేకపోవడంతో చేతికి వచ్చే దశలో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేస్తే పొట్ట దశకు వచ్చిన పంట ఎండిపోతుందన్నారు. లద్నూరు రిజర్వాయర్‌కు వెంటనే నీటిని విడుదల చేయాలని డీఈ శ్రావణ్, ఏఈ వెంకన్నను కోరారు. బొమ్మకూరు రిజర్వాయర్‌లోకి పై రిజర్వాయర్‌ల నుంచి నీళ్లు వచ్చాక పంపింగ్ లెవల్ వచ్చిన వెంటనే నీటిని విడుదల చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ గుజ్జక సమ్మయ్య, రైతులు పాకాల ఆదం, కాసర్ల కనకరాజు, రాజు, నందా శ్రీనివాస్, పెద్ద శ్రీనివాస్, కాసర్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఒత్తిడితోనే నీటి విడుదల: జనగామ ఎమ్మెల్యే

జనగామ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ, తాను అసెంబ్లీలో ఒత్తిడి తీసుకురావడంతోనే దేవాదుల ఫేజ్-3 మోటార్ల ద్వారా నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవన్నపేట ఫేజ్-3 మోటార్లను ఆన్ చేసేందుకు ఈనెల 19న నీటి పారుదల శాఖ మంత్రి రానున్నారని, తాము నిలదీయడంతోనే ప్రభుత్వం స్పందించిందని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టులోని తపాస్‌పల్లి, గండిరామారం, బొమ్మకూరు, వెల్దండ, లద్నూరు, కన్నెబోయినగూడెం రిజర్వాయర్లను నింపి సాగు నీరివ్వాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. వరి నాట్లు అయిపోయి నీళ్ల కోసం రైతులు తండ్లాడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదని మండిపడ్డారు. రెండు నెలల్లో కేవలం 40రోజులు మాత్రమే పంపులు నడిపించడం శోచనీయమన్నారు. సకాలంలో నీటిని విడుదల చేయకపోవడం మూలంగా జనగామ నియోజకవర్గంలో 50 శాతం పంటలు ఎండిపోయాయన్నారు. నీటి విడుదల చేయాలంటూ ఇరిగేషన్ అధికారులు, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నెత్తీనోరు కొట్టుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఉన్న మోటార్లను బంద్ చేశారన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు ముఖ్యమంత్రి రాక సందర్భంగానైనా మోటార్లను ఆన్ చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి ఫేజ్-3 మోటార్లను ఆన్ చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. దేవన్నపేట ఫేజ్-3 మోటార్లతో పాటు ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి గండిరామారం రిజర్వాయర్ వరకు ఉన్న అన్ని పంపులను ఆన్ చేసి చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలని, లేని పక్షంలో రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

జమిలి ఎన్నికలతోనే దేశం అభివృద్ధి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

జనగామ రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే జమిలి ఎన్నికలతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ జిల్లా ప్రోగాం కన్వీనర్ పజ్జూరి లక్ష్మినర్సయ్య అధ్యక్షతన సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యశాల సమావేశం నిర్వహించారు. రమేశ్ మాట్లాడుతూ దేశంలో ఏకకాలంలో ఎన్నికలు జరిగితే ఎన్నికల ఖర్చు భారీగా తగ్గుతుందన్నారు. రాష్ట్రాల్లో ఒక్కో సమయంలో ఎన్నికలు జరుగుతుండటంతో తరుచూ ఎన్నికల కోడ్ రావడం అభివృద్ధికి ఆటంకం కలగడమే కాకుండా, ప్రజాధానం వృథా అవుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, కెవీఎల్ఎన్‌రెడ్డి, శివరాజ్ యాదవ్, కొంతం శ్రీనివాస్, పూసాల శ్రీనివాస్, దేవరాయల ఎల్లయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నీటి సంపులో పడి యువతి దుర్మరణం



స్వాతి (ఫైల్)

చిలుపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి యువతి మృతి చెందిన ఘటన సోమవారం రాజవరంలో చోటుచేసుకుంది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కథనం ప్రకారం. గ్రామానికి చెందిన సామల సదానందం-రజిత దంపతులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సామల స్వాతి(21) (శారీరక ఎదుగుదల లేని స్థితి) ఆదివారం సాయంత్రం ఇంటిముందున్న నీటి సంపులో బకెట్‌తో నీళ్లను తోడుతోంది. ఈక్రమంలో అదుపు తప్పి పడిపోయింది. కాసేపటికి నీటి అలికిడి వినిపించడంతో తల్లిదండ్రులు సంపుదగ్గరి కవెళ్లి చూడగా స్వాతి అందులో కనిపించింది. వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా, పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వినయ్ (ఫైల్)

చిలుపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ధర్మసాగర్ మండలంలోని ఎలుకుర్తి క్రాస్‌రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలుపూర్ మండలంలోని నష్కల్‌కు చెందిన యువకుడు మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన చేగొండి సంపత్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడు చేగొండి వినయ్ (21) ఇంటర్ వరకు చదువుకుని వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. ఆదివారం రాత్రి తన స్నేహితుడు అరవింద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై హైవే మీదుగా ధర్మసాగర్‌లోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. వినయ్ బైక్ తోలుతుండగా, ఎలుకుర్తి క్రాస్‌రోడ్ వద్దకు వెళ్లగానే, ఎడమ వైపు నుంచి కోళ్ల లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. సమాచారమందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులిద్దరినీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వినయ్ మృతి చెందాడు. కాగా, చేతికందిన కొడుకు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

హత్య కేసులో నలుగురి అరెస్ట్

- నిందితుల నుంచి కత్తి, బైక్ స్వాధీనం
- వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రాంచరణ్

జఫర్‌గడ్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తీగారంనకు చెందిన గోనె ప్రవీణ్ హత్యా ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 14న హోలి పర్వదినం నాడు ప్రవీణ్ దారుణ హత్యకు గురైన విషయం విదితమే. వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు, జఫర్‌గడ్ ఎస్ఐ బానోత్ రాంచరణ్‌నాయక్ సోమవారం విలేకరులకు తెలిపిన ప్రకారం ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితతో ఇదే గ్రామానికి చెందిన హతుడు ప్రవీణ్, తమ్మడపల్లి(ఐ)కి చెందిన జంగిలి బాలరాజుకు వివాహేతర సంబంధాలు ఉన్నాయి. ఈ విషయంలో ఇరువురి మధ్య గతంలో గొడవలు జరిగాయి. 14న బాలరాజు, ప్రవీణ్‌లు ఫోన్‌లో మాట్లాడుకుని పరస్పరం దూషించుకున్నారు. ఆగ్రహించిన బాలరాజు ఇదే రోజున తమ్మడపల్లి(ఐ)కి చెందిన తోటి మిత్రులైన జంగిలి అనిల్, జంగిలి రాజశేఖర్, జంగిలి ప్రశాంత్‌లను వెంట తీసుకుని రెండు బైక్‌లపై తీగారంనకు వెళ్లారు. వ్యవసాయ బావి వద్ద ఉన్న ప్రవీణ్‌తో గొడవపడ్డారు. ప్రవీణ్‌ను వెంట వచ్చిన ముగ్గురు వ్యక్తులు పట్టుకోగా బాలరాజు వెంట తెచ్చుకున్న కత్తితో పొట్టలో పలుమార్లు పొడిచాడు. అనంతరం వారు బైక్‌లపై పారిపోయారు. రక్తపు మడుగులో పడి ఉన్న ప్రవీణ్‌ను ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. ప్రధాన నిందితుడు జంగిలి బాలరాజు, సహ అనిల్, రాజశేఖర్, ప్రశాంత్‌లను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రాంచరణ్ తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సాగునీటి కోసం సీపీఐ పాదయాత్ర



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

22, 23న ఆర్డీవో ఆఫీసు వరకు యాత్ర : సీపీఐ

జఫర్‌గడ్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉప్పుగల్లు రిజర్వాయర్ ద్వారా సాగునీటిని అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రైతులతో పాదయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువారి రమేశ్ తెలిపారు. పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను జఫర్‌గడ్‌లో సోమవారం పార్టీ ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ 22న జఫర్‌గడ్ మండలం ముగ్దుంతండాలో యాత్ర ప్రారంభమై, 23న స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఆర్డీవో కార్యాలయం చేరడంతో ముగుస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప్పుగల్లు రిజర్వాయర్ నిర్మించి కాలువల తవ్వకం వదిలేసిందన్నారు. ఏడేళ్లయినా నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. సమావేశంలో నాయకులు ఎండి. వలీపాషా, సమ్మయ్య, రడపాక సత్తయ్య, ఎండి. జాఫర్, నాగరాజు, సురేందర్, మల్లయ్య, కిరణ్, పాల్గొన్నారు.

గురుకులం ఏర్పాటు అభినందనీయం

కోనాయిచలం పరిధిలోని ప్రభుత్వ భూమిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమని రమేశ్ అన్నారు. సోమవారం స్కూల్ నిర్మాణమయ్యే 161/సి/2 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఆయన పార్టీ ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఉద్యమ ఫలితంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆ భూమిలో నేడు రూ.200కోట్లచే గురుకులం నిర్మించేందుకు దోహద పడుతుందన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తరిగొప్పుల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మొరం దందా అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. జనగామ జిల్లా ఇరిగేషన్ డీఈ శ్రవణ్ కుమార్, ఏఈ శశికళతో కలిసి సోమవారం మండల కేంద్రంతోపాటు అంకుషాపూర్ గ్రామాల్లో అక్రమంగా తవ్వకాలు జరిపిన ప్రదేశాలను తనిఖీ చేసి గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టారు. డీఈ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ శిఖంలో అక్రమంగా తవ్వకాలు చేసి మట్టి దందా చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. తరిగొప్పుల మండల పరిధిలో చేపట్టిన అక్రమ తవ్వకాలపై విచారణ జరిపి నివేదిక కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గుజ్జ రవీందర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



అంకుషాపూర్ శిఖం భూముల్లో అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు



గంగదేవిపల్లిని సందర్శించిన కేంద్ర సర్వీస్ బృందం

గంగదేవిపల్లిని సందర్శించిన కేంద్ర బృందం

గీసుగొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని 26 మందితో కూడిన కేంద్ర సర్వీస్ బృందం ఇండియా సెక్రటేరియట్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కిశోర్‌సోని ఆధ్వర్యంలో సోమవారం సందర్శించింది. వృత్తిపరమైన శిక్షణలో భాగంగా మర్రిచెన్నారెడ్డి మానవవనరుల కేంద్రానికి వచ్చిన బృందం ఫీల్డ్ విజిట్ కోసం గంగదేవిపల్లికి వచ్చి గ్రామాభివృద్ధిని అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా బృందానికి జిల్లా ట్రేయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి గ్రామాభివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, లభించిన జాతీయ, అంతర్జాతీయ అవార్డుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాజీవ్, మార్గం కుమారస్వామి, గూడ సరోజన తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ట్రైబల్ వర్సిటీ వీసీ

ములుగు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా వై.ఎల్.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు మండలం జాకారంలోని వర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌లో విధుల్లో చేరిన ఆయనకు ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అంతకు ముందు తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మ, వనదేవతల గద్దెలను దర్శించుకున్న వీసీ సంప్రదాయ పూజలు చేశారు. పూజారులు ఆయనకు కండువా కప్పి ప్రసాదం అందజేశారు. కలెక్టర్ టీఎస్.దివాకరను వీసీ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.



నూతన వీసీని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ దివాకర

నిట్ చైర్‌పర్సన్ స్థానే విధుల అప్పగింతపై సవరణ

- జారీ అయిన గెజెట్ నోటిఫికేషన్
- వరంగల్ నిట్ -2017 స్యాచ్యూట్‌లో సబ్‌సెక్షన్ 4 చేర్పు

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఏదైనా కారణం వల్ల బోర్డ్ ఆఫ్ గవర్నర్ ఛైర్‌పర్సన్ విధుల్లో లేని కాలంలో ఆయన బాధ్యతలను మరో జాతీయ ప్రాధాన్యత కలిగిన ఇన్‌స్టిట్యూట్ ఛైర్‌పర్సన్‌కు అప్పగించే విషయంలో సవరణ చేస్తూ వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి గెజెట్ నోటిఫికేషన్ జారీ చేశారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్ ఛైర్‌పర్సన్ పదవీ కాలం ముగియడం, మృతి చెందడం, రాజీనామా చేయడం లేదంటే ఇతరత్రా కారణాల వల్ల ఖాళీ అయినా.. అనారోగ్యం, గైర్హాజరు లేదా మరే కారణం వల్ల విధులు నిర్వహించలేక పోయినా చట్టంలోని 16వ సెక్షన్ ప్రకారం ఆయన స్థానంలో జాతీయ ప్రాధాన్యత కలిగిన మరో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్‌పర్సన్‌కు అప్పగిస్తూ సవరణ చేశారు. అయితే ఈ బాధ్యతల అప్పగింత కాలపరిమితి ఆరు నెలల వరకు లేదంటే ఒక వేళ ఛైర్‌పర్సన్ కాలపరిమితి ముగిసిన పక్షంలో మరో రెగ్యులర్ ఛైర్‌పర్సన్ నియామకమయ్యే వరకు వరంగల్ నిట్ విజటర్ ఆమోదం మేరకు అమలులో ఉంటుంది. ఈ మేరకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ స్టాచ్యూట్స్ -2017లో సబ్-స్టాచ్యూట్ (4)ను చేర్చడం ద్వారా ఈ సవరణ చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్-2017ను ఇక నుంచి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ స్టాచ్యూట్-2025గా పిలుస్తారు.

వన్యప్రాణులను వేటాడిన ఐదుగురి అరెస్ట్

ఖానాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పాకాల అభయారణ్యంలో వన్యప్రాణులను వేటాడిన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు నర్సంపేట రేంజ్ ఆఫీసర్ రవికిరణ్ సోమవారం తెలిపారు. చిలుకమ్మనగర్ శివారులోని అటవీ ప్రాంతంలో ఆదివారం వేటగాళ్లు అమర్చినఉచ్చులో పడ్డ కనుజును మాంసంగా మార్చి, కొండగొర్రె కళేబరాన్ని ఆటోలో తరలిస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వన్య ప్రాణుల వేట వెలుగులోకి వచ్చిన విషయం విదితమే. కాగా, ఫారెస్ట్ అధికారులు వేటకు పాల్పడ్డ ఆరుగురిని గుర్తించి ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన వారిలో చిలుకమ్మనగర్‌కు చెందిన బంగారి సుమన్, ఇస్లావత్ సుధీర్, పాయం పవన్‌కుమార్, అశోక్‌నగర్‌కు చెందిన సురేష్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెంకు చెందిన బాబురావు అలియాస్ లవకుమార్ ఉన్నారు. ఏకాంబ్రం చికిత్స పొందుతున్నట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

నిర్బంధాల మధ్య సీఎం రేవంత్ రెడ్డి సభ

- అట్టర్‌ప్లాప్ సీఎంగా రేవంత్‌రెడ్డి మిగిలిపోతారు
- దమ్ముంటే కడియంతో రాజీనామా చేయించాలి
- మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, పెద్ది సుదర్శన్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్బంధాల మధ్య ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను నిర్వహించారని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలదీస్తున్నారని ఉద్యమకారులను, బీఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్టులకు పాల్పడినట్లు బీఆర్ఎస్ నేత, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డిలు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి తిన్నింటి వాసాలు లెక్కపెట్టి అధికార దాహం కోసం బీఆర్ఎస్‌కు వెన్నుపోటు పొడిచి కూతురు రాజకీయం కోసం కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి రాజకీయ విలువల గురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గంలో 9 రిజర్వాయర్లతో 1.40 లక్షల ఎకరాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పంటలకు సాగునీరు అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గాన్ని ఎడారిలా మారుస్తున్నారని దుయ్యబట్టారు. కడియం శ్రీహరి పచ్చి అవకాశవాదిగా మారి ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వ సొమ్ముతో నిర్వహించిన బహిరంగ సభ మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించడానికి ఉపయోగించారని ఎద్దేవా చేశారు. ఆ సభతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం జరుగలేదన్నారు. గత ప్రభుత్వంలో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. 15 నెలల్లో తట్టెడు మట్టి తీయలేదని కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చే పరిస్థితేలేదని విమర్శించారు.

హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్‌లో మాజీ సీఎం కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అవినీతి, అక్రమాలు, దోపిడీ, విధ్వంసం రాజ్యమేలుతుందని ధ్వజమెత్తారు. కడియం శ్రీహరి మొఖంలో ఉపఎన్నిక భయం కనిపిస్తుందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కడియం శ్రీహరితో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఎప్పుడు ఉప ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ప్రజలు గెలిపిస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్ కుటుంబంపై రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను మర్చ్యూరీకి పంపిస్తా, తాగుబోతు అని విమర్శలు చేయడంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డిపై 89 క్రిమినల్ కేసులు ఉన్నాయని దేశంలోనే అట్టర్‌ప్లాప్ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఎక్కువ రోజులు కొనసాగరని అన్నారు. అందుకోసమే బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకొని తన పదవిని కాపాడుకుంటున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి దమ్ముంటే కడియంతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి పల్లెత్తు మాట మాట్లాడిన ప్రజల చేతిలో నిర్బంధం తప్పదని హెచ్చరించారు.

కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ కన్నుమూత

- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రవిందర్
- రవిందర్‌కు పలువురు నేతల నివాళి



అంతిమ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



రవిందర్(ఫైల్)

రఘునాథపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు చీమలపాటి రవిందర్(58) సోమవారం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రఘునాథపల్లికి చెందిన రవిందర్ అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. కంచనపల్లి పీఏసీఎస్ పరిధిలోని రఘునాథపల్లి నుంచి డైరెక్టర్‌గా 2019లో ఎన్నికవగా 15 ఫిబ్రవరి 2019న చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రవిందర్ మృతితో రఘునాథపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రవిందర్‌కు భార్య విజయ, ఇద్దరు కుమారులు మధు, ప్రవీణ్, కుమార్తె మమత ఉన్నారు. రవిందర్ మృతదేహానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవిందర్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, ములుగు అడిషనల్ కలెక్టర్ జి.మహేందర్‌జీ, రాష్ట్ర అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.కుమార్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ తదితరులు నివాళులర్పించారు.

కార్మిక భవన్ కూల్చివేతపై చర్చ

శాసనమండలిలో ప్రశ్నించిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో అజంజాహి మిల్లు కార్మిక భవన్ కూల్చివేతపై సోమవారం శాసనమండలిలో చర్చ జరిగింది. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. కార్మిక భవన్‌కు 80 ఏళ్ల చరిత్ర ఉందని, ప్రత్యక్షంగా.. పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించిందని గుర్తుచేశారు. ఆ స్థలానికి కొందరు దొంగ కాగితాలు సృష్టించి ఓ వస్త్ర వ్యాపారికి అమ్మగా... ఆ వ్యాపారి కార్మిక భవన్‌ను కూల్చివేశారని, దాంట్లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించడం కోసం భూమి పూజ కూడా చేశారని, ఈ పూజకు మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీధర్‌రావు వెళ్లి కొబ్బరికాయ కొట్టారని వివరించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కుమ్మక్కై దానికి తప్పుడు కాగితాలు పుట్టించారని, ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అదే స్థలంలో కార్మిక భవన్‌ను నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు.

రేపు విద్యుత్ చార్జీల ప్రతిపాదనపై బహిరంగ విచారణ

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేసిన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనపై బుధవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు బహిరంగ విచారణ చేపడుతున్నట్లు ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు పాల్గొంటున్నారని, ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉన్న 17 జిల్లాల వినియోగదారులు బహిరంగ విచారణలో పాల్గొని అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు.

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

వినతులు స్వీకరించిన హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు



హనుమకొండలో బాధితుల సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య



వరంగల్ కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన వినతులను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 94 వినతులు అందగా శాఖల వారీగా వాటిని ఎండార్స్ చేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 20, కలెక్టరేట్ సూపరింటెండెంట్ 6, జీడబ్ల్యూఎంసీ 6, పౌర సరఫరాల శాఖ 7, విద్యాశాఖ 4 వినతులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీవో నీరజ, డీపీవో కల్పన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

ప్రజావాణి అనంతరం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందుల ఏర్పాటుపై మండలాల వారిగా సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

హనుమకొండ : వివిధ సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా వచ్చే ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలు వెంటనే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 76 ఆర్జీలు వచ్చాయి. కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత బాధితుల నుంచి సమస్య తెలుసుకుని అధికారులను పిలిచి సమస్య ఎంక్వైరీ చేసి పరిష్కరించాలన్నారు. ఈ సందదర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దన్నారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక అవసరాలను తీర్చేవి ప్రభుత్వ వర్సిటీలే..

- వీటి అభివృద్ధికి విరివిగా నిధులు కావాలి
- కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- కేయూలో పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి సదస్సు



పీడీఎస్‌యూ రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సామాజిక అవసరాలు తీర్చేవి ప్రభుత్వ వర్సిటీలేనని కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో 'యూజీసీ నూతన నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీల స్వయం ప్రతిపత్తి' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సుకు వీసీ, సామాజికవేత్త, రిటైర్డు ప్రొఫెసర్లు కూరపాటి వెంకటనారాయణ, మండ సారంగపాణి హాజరై మాట్లాడారు. మొదట వీసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ వర్సిటీలను కాపాడుకోవాలన్నారు. ప్రైవేట్ వర్సిటీలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్ర పరిధిలోని వర్సిటీల అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. పరిశోధనకు విరివిగా నిధులు కేటాయించాలన్నారు. నాణ్యమైన బోధనకు అధ్యాపకుల నియామకాలు జరగాలని స్పష్టం చేశారు. కేంద్రం, యూజీసీలు రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీలకు నిధుల్లో భారీగా కోత విధించడంపై రిటైర్డు ప్రొఫెసర్ వెంకటనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, మహిళ వర్గాలకు ఇచ్చే ఫెల్లోషిప్‌లను తగ్గిందన్నారు. మరో రిటైర్డు ప్రొఫెసర్ సారంగపాణి మాట్లాడుతూ.. కేంద్ర నూతన జాతీయ విద్యా విధానం-2025 విద్యను వ్యాపారంగా మార్చేందుకేనని ఆరోపించారు. ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలకు విచ్చలవిడిగా అనుమతులిచ్చి ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి నున్నా అప్పారావు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. యూజీసీ నూతన నిబంధనలకు వ్యతిరేకిస్తూ విద్యార్థులు, యువతను చైతన్యం చేస్తున్నామన్నారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకమైన కేంద్ర విధానాలను యువత అడ్డుకోవాలని పీడీఎస్‌యూ జాతీయ నేత ఈడంపాక విజయ్‌కన్నా పిలుపునిచ్చారు. ఈ సదస్సులో పీడీఎస్‌యూ నేతలు డాక్టర్ సుత్రాపు అనిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ, సహాయ కార్యదర్శి మిశ్రిన్ సుల్తానా, జిల్లా అధ్యక్షుడు రాచకొండ రంజిత్, వర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు పవన్ కల్యాణ్, వంశీకృష్ణ, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో కేయూలో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్ మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం శాఖాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ నేతృత్వంలో మార్చి 21, 22 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్న కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలను వర్సిటీ పరిపాలన భవనంలోని వారి చాంబర్‌లో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందచేశారు. 'ప్రజాస్వామ్య భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాల ప్రాధాన్యత' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరుగుతోంది. దీనికి ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డితో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి రాజనీతిశాస్త్రవేత్తలు, స్కాలర్లు, విద్యార్థులు హాజరుకానున్నారు.

ఐటీఐ ప్రాంగణంలో 20న జాబ్‌మేళ

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగుల కోసం ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం. మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకులలో సుమారు 20 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ములుగురోడ్‌లోని ఐటీఐలో ఉదయం 11 గంటలకు జాబ్ మేళ ఉంటుందన్నారు. వివరాలకు 98488 95937 సెల్ నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2216	2100
పల్లికాయ (సూక)	7150	6500
పల్లికాయ (పచ్చిది)	4400	3400
కందులు	6652	5540
పెసళ్లు	7407	4645
పత్తి	6825	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13500	9000
వండర్‌హాట్	15800	11500
యూఎస్341	13000	9500
దేశీ	30000	25500
సింగిల్ పట్టి	32000	35000
దీపిక	16000	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

నిరంతర సాధన అవసరం



నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్లు వచ్చి చేతి రాతకు పెద్దగా పనిలేకుండా చేశాయి. దీనికి తోడు చాలా విద్యాసంస్థలు కేవలం బట్టీ పట్టించేందుకు చదువు మీద పెట్టిన శ్రద్ధను విద్యార్థుల చేతి రాతపై పెద్దగా పెట్టడం లేదు. దీని వల్ల పరీక్షల్లో జవాబులు అన్నీ సరిగానే రాసినప్పటికి అందమైన చేతి రాత లేక మార్కులు తగ్గిపోయి విద్యార్థులు నష్టపోతున్నారు. అందుకు ఒక్కసారి అందంగా రాయడం నేర్చుకుంటే జీవితాంతం అందంగానే రాయవచ్చు.

- రెడ్డిమల్ల వెంకటస్వామి, తెలుగు ఉపాధ్యాయుడు, ల్యాబర్తి

అందమైన రాత చాలా ముఖ్యం



చదవడంలో ఎన్ని మార్పులు వచ్చినా, అలాగే ఆన్‌లైన్ పుస్తకాలు చదవి పరీక్షలు రాసే పద్ధతి వచ్చినా చేతి రాతకు ఉండే ప్రాముఖ్యత నేటికీ తగ్గలేదు. ఇందుకోసం ప్రతీ విద్యార్థికి అందమైన చేతి రాత అనేది చాలా ముఖ్యం. పరీక్షల్లో రాసే జవాబులు అందంగా కనిపిస్తే పేపర్లు దిద్దే వారు గుర్తించి అదనపు మార్కులు వేసే అవకాశాలున్నాయి. విద్యార్థులు చదువుతో పాటు చేతి రాతకు కూడా ప్రాధాన్యమివ్వాలి. చదివింది, రాయడం వల్ల చాలా వరకు గుర్తుండిపోతుంది.

- పోగుల నాగరాజు, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు, ల్యాబర్తి

చేతి రాత.. మారాలి!

అక్షరాలు అందంగా ఉంటే మరిన్ని మార్కులు

- సాధన చేస్తేనే అలా రాయడం సాధ్యమంటున్న ఉపాధ్యాయులు
- పదో తరగతి విద్యార్థులకు మరింత మేలు
- 21 నుంచి వార్షిక పరీక్షలు

వర్ధన్నపేట రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్‌పై క్షణాల్లో అందమైన అక్షరాలను తీర్చిదిద్దగల ఈ ఆధునిక యుగంలో, చేతి రాతకున్న ప్రత్యేకత ఏమాత్రం తగ్గలేదు. చేతి రాతను బట్టి వారి గుణగణాలను చెప్పవచ్చనేది నానుడి. పరీక్షల వేళ జవాబు పత్రాలు దిద్దే ఉపాధ్యాయులకు అక్షరాలు అందంగా కనిపించేలా జవాబులు రాస్తే చాలు ఇక అదనపు మార్కులు సాధించవచ్చని వేరే చెప్పక్కర్లేదు. ఇందుకోసం విద్యార్థులు నిరంతరం సాధన చేస్తేనే అందమైన చేతి రాత సాధ్యమవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతీ విద్యార్థి చేతి రాతకు ఉన్న గుర్తింపు గురించి తెలుసుకుని, అందుకు అనుగుణంగా మార్చుకుంటేనే భవిష్యత్తులో అన్నింటికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ ప్రారంభం కాగా, పదో తరగతి పబ్లిక్ పరీక్షల వేళ చేతి రాతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పరీక్ష సమయంలో తడబాటు..

పరీక్షల గంట మోగింది. ఈనెల 21వతేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు పది పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు అంటే విద్యార్థులకు తెలియని భయం. ఆ భయంతో పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను రాసే క్రమంలో చేతి రాత వంకరటింకరగా వస్తుంది. ఇంకొందరు విద్యార్థులు ముందుగా అందంగానే మొదలు పెట్టినప్పటికీ, పోనుపోను అందంగా రాయలేక ఇష్టం వచ్చినట్లు రాస్తుంటారు. దీంతో ప్రశ్నలకు, జవాబులు సరిగా రాసినప్పటికి చేతి రాత సరిగా లేకపోవడంతో పేపర్లు దిద్దే వారికి సరిగా అర్థం కాకపోవడం వల్ల మార్కులు కూడా తగ్గే ఆస్కారం ఉంది. కాబట్టి ముందు నుంచే విద్యార్థులు చేతి రాతపై దృష్టి పెట్టాలి. చదివిన దానిని చేతి రాతతో రాయడం వల్ల మరిచిపోయే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి రాయడం వల్ల అందమైన దస్తూరి రావడంతో పాటు చదివింది కూడా గుర్తుకు ఉండడానికి ఉపకరిస్తుంది. ఇలా రెండు రకాలుగా తోడ్పడుతుంది. అందమైన చేతి రాతతో అక్షరాలను పొందికగా ముత్యాల్లాగా పేర్చి ఆకర్షించే విధంగా జవాబులు రాయడం వల్ల పేపర్లు దిద్దే వారికి రాసిన జవాబులు అందంగా కనిపిండడంతో అదనపు మార్కులు పొందే అవకాశాలు చాలా ఉన్నాయి.



ల్యాబర్తిలో పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు



విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలు...

- విద్యార్థులు పరీక్షల్లో జవాబులు రాసేటపుడు అక్షరాలు పొందికగా, ముత్యాల్లాగా పేర్చినట్లు అందంగా కనిపించాలి. అదేవిధంగా స్పష్టంగా రాయాలి.
- ఒక్క పేజీలో కేవలం 16 నుంచి 18 లైన్లు మాత్రమే వచ్చే విధంగా రాయడం మంచిది.
- సమాధాన పత్రం పైకి, కిందికి పక్కలకు బార్డర్లకు వదిలి సమానంగా రాయాలి.
- పరీక్ష రాసేటపుడు ఒద్దికగా పూర్తిగా అనుకూలంగా కూర్చోని రాయాలి.
- తెలుగు, హిందీ, అక్షరాలను నాలుగు మి.మీ.లే, ఇంగ్లీష్ అక్షరాలను మూడు మి.మీ.లు ఉండే విధంగా చూసుకోవాలి.
- అక్షరాలు, పదాలు, లైన్‌ల మధ్య తగినంత గ్యాప్ ఉండేలా చూసుకోవాలి.
- అక్షరాలను ఒత్తిపెట్టి రాయకూడదు. అలా రాయడం వల్ల పేజీ వెనుక భాగం వైపు కనిపిస్తుంది. దీని వల్ల వెనక వైపు ఉన్న రాత కూడా కనిపించకుండా పోయి నష్టపోవాల్సి వస్తుంది.
- గణితంలో సమీకరణాలు, సైన్స్‌లో పటాలు, పోటీభాగాలు అందంగా కనిపించే విధంగా రాయాలి.
- జవాబులు రాసేటపుడు వాటికి సైడ్ హెడ్డింగ్‌లు. పేరాలు చేయాలి.
- తెలుగు, ఇంగ్లీష్ రాసేటప్పుడు ఎప్పుడు సవ్య దిశలోనే రాయాలి.

చెట్ల నీడన చదువు..

ఓవైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు ఇంటర్ విద్యార్థుల్లో వార్షిక పరీక్షల వేడి. ఈ క్రమంలో వారు మంచి మార్కులు పొందాలంటే అనువైన వాతావరణం ఉండాలి. ప్రకృతి కన్నా అనువైన వాతావరణం ఏముంటుంది. మరీ ముఖ్యంగా చెట్ల నీడలో చదువుకోవడం కంటే ఆనందం ఇంకేముంటుంది. అందుకే భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మైనారిటీ కళాశాలలో విద్యార్థులు ఇదిగో ఇలా అందరూ చెట్ల నీడన కుర్చీలు వేసుకుని కూర్చుని చదువుకుంటున్నారు.



చెట్ల నీడలో కూర్చొని పరీక్షకు సిద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి



మహబూబాబాద్‌లో జయరాజ్‌ను సన్మానిస్తున్న ఘనపురపు అంజయ్య దంపతులు

తెలంగాణ సంస్కృతి అంటేనే పాట

- కడుపులో తూటాలు పెట్టుకుని పోరాడిన యోధుడు గద్దర్
- గద్దర్ పేరిట సినీ అవార్డులను ప్రకటించడం గొప్ప విషయం
- ప్రయుఖ కవి, గాయకుడు గొడిశాల జయరాజ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి అంటేనే పాట అని, ఏ ఉద్యమానికైనా ఆ పాట వెన్నుదన్నుగా, ముఖ్య భూమికగా నిలిచిందని ప్రముఖ కవి, గాయకులు గొడిశాల జయరాజ్ అన్నారు. తన సొంతూరు మహబూబాబాద్ పట్టణానికి విచ్చేసిన ప్రముఖ కవి, గొడిశాల జయరాజ్‌ను సోమవారం కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జయరాజ్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా నిలిచిన పోరాటయోధులకు గత పదేళ్లలో ఇవ్వాల్సిన గుర్తింపు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కవులకు తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ రచించిన పాటను తెలంగాణ గీతంగా ప్రకటించడం, తన కడుపులో తూటాలు పెట్టుకుని పోరాడిన యోధుడు గద్దర్ పేరిట సినీ అవార్డులను ప్రకటించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్‌ను సినీ పరిశ్రమను విడదీయలేరని 'బండెనక బండి కట్టి.. ఏ బండ్లె పోతావు కొడుకో.. నైజాం సర్కరోడా' అంటూ గద్దర్ రాసిన, పాడిన అనేక పాటలు వెండితెరపై ఉర్రూతలూగాయని చెప్పారు. వెండి తెరనుంచి గద్దర్‌ను తొలగించలేరని, సినీ పరిశ్రమకు ఆయన పెద్ద దిక్కుగా నిలిచారని వివరించారు. సాంస్కృతిక చిహ్నంగా గద్దర్ పాటలు నిలిచాయని తెలిపారు. విద్యార్థి ఉద్యమాలు.. విప్లవోద్యమమైనా.. తెలంగాణ ఉద్యమంలోనైనా కవిగా నిలబడడానికి ఘనపురపు అంజయ్య తనకు వెన్నుదన్నుగా నిలిచారని చెప్పారు.

ఉద్యానంలో యువజోష్

- కొత్తవంగడాలతో కాసుల పంట
- ప్రత్యామ్నాయ సాగులో ఆదర్శంగా రైతులు

తొర్రూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం చేయడమంటేనే అప్పులు, ఆత్మహత్యలు అంటూ వదిలేసి, చిన్న ఉద్యోగమైనచాలని పట్టణాల వైపు పరుగులు పెడుతున్న రోజులివి. కానీ వ్యవసాయం దండగ కాదు పండుగని నిరూపిస్తున్నారు ఈ యువ రైతులు. తమ తల్లిదండ్రులు నమ్ముకున్న భూమినే అమ్మలా భావించిన ఆ యువకులు ఉద్యానపంటల్లో కొత్త వంగడాలను ఎంచుకుంటూ లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం వరి, పత్తి, మిర్చి పంటలు సాగు చేసి.. వ్యాపించే తెగుళ్లు, రోగాలతో రైతులు అప్పుల పాలువుతున్న నేపథ్యంలో అత్యాధునిక వంగడాలతో ఉద్యాన పంటల్లో.. మెళకువలు, బిందు సేద్యం, మల్చింగ్ విధానం పాటిస్తూ రాణిస్తున్నారు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కొత్తగూడకు చెందిన కందాడ అశోకొరెడ్డి, గంటకోల్ (జీకే) తండాకు చెందిన యువత రైతు సోదరులు గుగులోతు రమేష్, రవి. వీరు తమతమ భూముల్లో లాభాలు పండిస్తూ ఔరా అనిపిస్తున్నారు.

సీజనల్‌గా పండిస్తూ లాభాల బాట

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామశివారు కొత్తగూడకు చెందిన కందాడ అశోకొరెడ్డి తనకు ఉన్న 10ఎకరాల భూమిలో తండ్రి వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించారు. ప్రత్యామ్నాయ పంటలతోనే లాభాలు వస్తాయని గ్రహించి ఐదేళ్లుగా ఉద్యాన పంటలైన సీజనల్ కూరగాయల సాగు, పుచ్చకాయల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆరు ఎకరాల్లో పామాయిల్, రెండు ఎకరాల్లో బీరకాయ, కాకరకాయ, ఇతర సీజనల్ కూరగాయలు వేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్స్, మల్చింగ్ విధానాన్ని పాటిస్తూ నీటిని ఆదాచేస్తూ, కలుపు నివారణతో ఖర్చులు తగ్గిస్తూ, సాగు చేపడుతున్నారు. కూరగాయలు అధిక ధరలు పలికే వరంగల్, ఖమ్మం మార్కెట్లకు తరలించడంతో పాటు చిన్న, సన్నకారు వ్యాపారులు తోట వద్దకు వచ్చి తీసుకొని నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బీరసాగు ఖర్చులు పోను రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. అంతేకాకుండా పామాయిల్ పంటలో అంతర్‌పంటగా పుచ్చకాయల సాగును చేపట్టారు.



అమ్మాపురంలో రైతు అశోక్‌రెడ్డి సాగు చేస్తున్న బీరకాయ తోట



జీకే తండాలో రమేష్, రవి సాగు చేస్తున్న చామంతి పూలసాగు

చామంతి సాగుతో ఆదాయం

తొర్రూరు మండలం గంటకోల్ (జీకే) తండాకు చెందిన యువ రైతు సోదరులు గుగులోతు రమేష్, రవి పూలసాగు చేయాలని హార్టికల్చర్ అధికారులను సంప్రదించారు. సాగుపై ఉన్న సబ్సిడీలను తెలుసుకొని పూల సాగులోనే బంగారు భవిష్యత్ ఉందని పూలసాగు చేపట్టి లాభాలు పొందుతున్నారు. రమేష్ తన అన్న రవితో కలిసి జీకే తండాలో ఉన్న ఆరు ఎకరాల్లో రెండు ఎకరాల్లో పాలీహౌస్ ఏర్పాటు చేసుకొని సీజన్ వారీగా చామంతి సాగు చేయడంతో పాటు మూడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ వేశారు. ఎకరం భూమిలో సరిపోయే 1.60 లక్షల మొక్కలను ఒక్కొక్కటి రూ.3చొప్పున కొనుగోలు చేసి నాటగా 100 నుంచి 120 రోజుల వ్యవధిలో చేతికి వస్తుంది. ఈ పువ్వులను ఎక్కువగా వివాహ, శుభకార్యాలకు, అలకంరణకు ఉపయోగించడంతో అధిక ధర పలుకుతోంది. చేతికి వచ్చిన పువ్వులను పది మొక్కల వరకు కటింగ్ చేసి బంచ్‌గా ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఎకరంలో సుమారు 15 వేల బంచ్‌లు దిగుమతి వస్తుంది. ఒక్క బంచ్ రూ.100 నుంచి రూ.150 ధరతో సీజన్ బట్టి విక్రయిస్తుంటారు. మార్కెటింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా హైదరాబాద్, పెద్దపెద్ద డేకరేషన్ హాల్స్‌కు పంపిస్తుంటారు. మొక్కలుగా కోసి ఇవ్వడంతో పువ్వు వాడిపోకుండా పది రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఎకరానికి రూ.6లక్షల వరకు పెట్టుబడి పెట్టగా, చామంతి పూలతో సంవత్సరానికి రూ.15 లక్షల ఆదాయం వస్తే, కూలీల ఖర్చు, ఎరువు మట్టి, ఇతర ఎరువుల ఖర్చు, మొక్కల ఖర్చు సుమారు రూ.8 లక్షల వరకు వస్తుంది. సుమారుగా సంవత్సరంలో రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దీనికి తోడు మూడు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంట ఆదాయంతో పాటు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కూడా కలిసొస్తోంది. సంప్రదాయ పంటల కంటే ఉద్యాన పంట సాగుతోనే అధిక లాభాలు వస్తున్నాయని యువ రైతులు ధీమాగా చెబుతున్నారు. వీరితో పాటు ఇదే గ్రామానికి చెందిన గుగులోతు భిక్షం అనే రైతు ఎకరం భూమిలో బెండకాయ, బుడంకాయ, దోసకాయ సాగు చేస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తున్నారు.


నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సమాయత్తం కావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఏప్రిల్, మే నెలల్లో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు పూర్తిగా సమాయత్తం కావాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. 16 సర్కిళ్ల అధికారులతో సీఎండీ సోమవారం సాయంత్రం హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. లోడ్ పెరిగే అవకాశం ఉన్న ప్రతీ చోట పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏప్రిల్‌లో కోతలు పూర్తైన తర్వాత వ్యవసాయ సర్వీసులను త్వరతగిన మంజూరు చేయాలన్నారు. అందుకు తగ్గట్లు మెటీరియల్ పూర్తి చేసుకోవాలన్నారు. బంచ్డ్ ఫీడర్లు ఉన్న చోట వీసీబీలు పెట్టి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వోల్టేజీని మెరుగుపరచడానికి లైన్‌లలో కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

25 ఏళ్ల నాటి బ్యానర్ పునరావిష్కరణ



నాటి ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కేసీఆర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా, వినయ్‌భాస్కర్, నరేందర్ తదితరులు

మట్టెవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సుమారు 25 ఏళ్ల నాటి స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార బ్యానర్‌ను సోమవారం రాత్రి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లో పునర్ ఆవిష్కరించారు. 2001 స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు జడ్పీటీసీగా పోటీ చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి వస్త్రంపైన బ్రష్‌తో రాయించిన ఎన్నికల ప్రచార బ్యానర్‌ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దాచిపెట్టి ఉంచారు. ప్రస్తుతం పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొంటున్న నేపథ్యంలో కేసీఆర్‌తో ఆ బ్యానర్‌ను పునరావిష్కరింపజేసి.. నాటి తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిని కేసీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, దాస్యం వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

కులవృత్తినే నమ్ముకున్నాడు.. కళాఖండాలు తీర్చిదిద్దుతున్నాడు..

సూక్ష్మకళలో సత్తా చాటుతున్న జయకుమార్



సూక్ష్మకళాకారుడు జయకుమార్



మైక్రో ఆర్టిస్ట్ జయకుమార్ తయారు చేసిన భారతచిహ్నం



సహజ పూలతో సూక్ష్మ బతుకమ్మ చిత్రం

నర్సంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ చదివిన అతడికి కొలువు దొరకలేదు. నిరుత్సాహ పడకుండా కులవృత్తినే జీవనోపాధిగా ఎంచుకున్నాడు. తండ్రి వద్ద స్వర్ణకారవృత్తిని ఒంటపట్టించుకున్నాడు. దీంతో ఏదో సాధించాలన్న పట్టుదలతో సూక్ష్మకళాఖండాలను రూపొందించడం ఆరంభించాడు నర్సంపేటకు చెందిన శ్రీరామోజు జయకుమార్. బలపాలపై, సబ్బుబిళ్ల తదితర వస్తువులపై అద్భుతాలు సృష్టిస్తున్నారాయన. నర్సంపేట పట్టణానికి చెందిన భిక్షమాచారి-భద్రమ్మ దంపతుల కుమారుడు జయకుమార్ 1995లో బలపాలపై అద్భుత కళాఖండాలను చెక్కి తన ప్రతిభకు సానబెట్టడం ప్రారంభించారు. నాడు ఈ సూక్ష్మకళాకారుడి కళాఖండాలను, ప్రతిభను 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక పాఠకులకు తొలిసారి పరిచయం చేసింది. అప్పటి నుంచి నేటి వరకు ఆయన అనేక అద్భుత కళాఖండాలను సృష్టించి ప్రముఖుల ప్రశంసలను అందుకున్నారు.

చాక్‌పీసులు, సబ్బులపై శిల్పాలు

జయకుమార్ పెన్సిళ్లు, చాక్‌పీస్‌లు, సబ్బుబిళ్లలపై శిల్పాలు చెక్కి జిల్లా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. జ్యోతిరావు పూలే అవార్డును కూడా దక్కించుకున్నాడు. 2005 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన సచిన్ టెండూల్కర్‌కు 20 మిల్లీ గ్రాముల బంగారంతో క్రికెట్ బ్యాట్‌ను తయారు చేసి కంటికి కనిపించే అక్షరాలతో మాస్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 2007లో ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్‌మహల్‌ను 7మిల్లీ మీటర్ల ముత్యంపై చెక్కి ఓట్‌ఫర్ ద తాజ్ అని చెక్కారు. 2008 ఏప్రిల్‌లో భారత క్రికెట్ చరిత్రలో 600 వికెట్లు సాధించిన కుంబ్లేకు కేవలం 0.15మిల్లీ గ్రాముల బంగారంతో వికెట్లు, బంతి, బేల్స్‌ను తయారుచేసి ఆయనకు కంగ్రాట్స్ అని రాశారు. 2009లో ముఖ్యమంత్రిగా ఎన్నికైన నాటి వైఎస్ఆర్‌కు చింతాకుపై శుభాకాంక్షలు తెలపారు. 2010లో పోస్టుకార్డుపై వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని గీశారు. తెలంగాణ ఉద్యమం ఎగిసిపడుతున్న సమయంలో వెంట్రుకపై జైతెలంగాణ నినాదాన్ని లిఖించాడు. బియ్యపు గింజపై తెలుగు అక్షరాలను చెక్కారు. యువకులు అడ్డదారిలో పయనించకుండా ఆధ్మాతిక భావన అలవర్చుకోవాలని ఓంకారంలో లింగాకారాన్ని తీర్చిదిద్దారు. ఈ విధంగా అనేక సూక్ష్మకళాఖండాలను చిత్రించి ప్రశంసలను అందుకున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులను జయకుమార్ అందుకున్నారు.



ఆకుపై గణపతి చిత్రం

మ్యూజియం ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యం

నిరుపేద స్వర్ణకార కుటుంబంలో జన్మించిన జయకుమార్ కంటికి కనిపించని కళాఖండాలను అనేకం సృష్టించారు. ఎన్నో కష్టాల కోర్చి రూపొందించిన ఈ సూక్ష్మ కళాఖండాలను ప్రజలకు చూపించడానికి మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రోత్సాహం, ఆర్థిక సాయం అందించాలని, తాను నేర్చుకున్న సూక్ష్మ కళను పదిమందికి నేర్పడంతో పాటు మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం తోడ్పాటును అందించాలని జయకుమార్ కోరుతున్నారు.

ప్రమాదం 'చింత'న

20 ఏళ్లుగా అవస్థ



ఇప్పగూడెంలో అక్కపల్లిగూడెం వెళ్లే మూల మలుపు వద్ద ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభం కింద పడిపోకుండా ఏర్పాటు చేసిన సపోర్టు తీగను విద్యుత్ సిబ్బంది చింతచెట్టుకు చేతులు దులుపుకున్నారు. 20ఏళ్ల కావస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చింతచెట్టుకు కట్టిన సపోర్టు తీగ ప్రమాదకరంగా మారినా పట్టించుకోవడం లేని గ్రామస్తులు మండిపడుతున్నారు. చట్ల అశోక్‌కు చెందిన స్థలంలో చింత చెట్టు ఉండడంతో చెట్టును తొలగించలేక, స్థలంలో ఇల్లు నిర్మాణం చేసుకోలేక పోతున్నానని అశోక్ వాపోతున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్తులు చట్ల ఉప్పలయ్య, కుర్ర ఉప్పలయ్య, వి.రాజు, పరమేష్, పద్మాకర్, ఎల్లయ్య, శేఖర్ తదితరులు కోరుతున్నారు.



-స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి)

కర్రలు, నేలపైనే వైర్లు

10 ఏళ్లుగా ఇదే దుస్థితి



స్టేషన్ ఘన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని శివునిపల్లి న్యూ ముదిరాజ్ కాలనీలో విద్యుత్ పోల్స్ లేకపోవడంతో కాలనీ వాసులు 10ఏళ్ల నుంచి అవస్థలు పడుతున్నారు. పద్మశాలి కాలనీ చివర్లో ఉన్న విద్యుత్ పోల్ మాత్రమే కాలనీవాసులకు దిక్కుగా మారింది. 50గృహాలకు చెందిన వారు విద్యుత్ కనెక్షన్ కోసం 200 నుంచి 300 మీటర్ల దూరం మేర సర్వీసు వైర్లను పోల్ నుంచి ఏర్పాటు చేసుకొని కరెంట్ సరఫరాను పొందుతున్నారు. పోల్ నుంచి సర్వీసు వైర్లను కట్టెలను ఆధారంగా చేసుకోగా, కొందరు భూమిపై పరుచుకుంటూ వైర్లను తీసుకెళ్లారు. భూమిపైన పరిచిన వైర్లను ఎలుకలు కొరికివేయడంతో గృహాలకు చెందిన వారు నిత్యం భయాందోళన చెందుతున్నారు. చిన్నారులు వైర్ల మీదుగా నడుకుంటూ వెళ్లే క్రమంలో ఏదైన ప్రమాదం జరుగుతుందేమోననే జంకుతున్నారు.



-స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి)



స్పేస్ సెంటర్‌లో ఉపగ్రహాల పనితీరును వివరిస్తున్న విద్యార్థి

'ఇస్రో' టెక్నాలజీ అదుర్స్

ఆకట్టుకున్న మిస్సైల్స్, శాటిలైట్స్ ప్రదర్శన

లింగాలఘణపురం, మార్చి17(ఆంధ్రజ్యోతి): వన్డే స్పేస్ అండ్ డిఫెన్స్ ఎక్స్‌పో కార్యక్రమంలో భాగంగా సోమవారం వనపర్తి పీవీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇస్రో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. పీవీఆర్ హైస్కూల్ వేదికగా కలామ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్, ఇస్రో, డీఆర్‌డీఎల్, డీఆర్‌డీవో సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఎం ఈవో పడాల విష్ణుమూర్తి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. పీవీఆర్ విద్యార్థులతోపాటుగా వడ్డిచర్ల మై మాస్టర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సుమారు 400మంది హాజరయ్యారు. డీఆర్‌డీవో రూపొందించిన ఆకాష్, క్విక్ రియాక్షన్ సర్ఫేస్‌ఎయిర్ మిస్సైల్, అస్త్ర, నాగ్ మిస్సైల్స్, ఇస్రో రూ పొందించిన శాటిలైట్స్ సిస్టమ్స్, జీఎస్‌ఎల్‌వీ-3, పీఎస్‌ఎల్‌వీ, ఇన్‌శాట్-3డి, చంద్రయాన్-1, ఆర్యభట్ట, జీఎస్‌ఎల్‌వీ-3, మంగ ళ్యాన్, జిసాట్31, శాటిలైట్ లాంచ్ వెహికిల్-3, ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్, రోహిణి శాటిలైట్, చంద్రయాన్-2, చంద్రయాన్-3 లాంటి ఉపగ్రహాల పనితీరును బాల శాస్త్రవేత్తలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీవీఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్‌పర్సన్ శ్రీలతారెడ్డి, జనగామ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ జిల్లా అధ్యక్షులు, పప్పు వెంకటరెడ్డి, మైమాస్టర్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎండి ఖదీర్, ఇస్రో కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



శ్రీవల్లీ నిఖిల్

పాలకుర్తి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పాలకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు గుంజె శ్రీవల్లీ, లాకావత్ నిఖిల్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 13న జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న 100 మీటర్ల పరుగు పందెంలో శ్రీవల్లీ, 400 మీటర్ల రన్నింగ్‌లో నిఖిల్ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. 23న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. శ్రీవల్లీ, నిఖిల్‌ను ఎంఈవో నర్సయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

సెయింట్ పాల్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో హెచ్‌ఎం మరియ జోసెఫ్

జనగామ కల్చరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సైన్స్ ఒలింపియాడ్‌లో జనగామలోని సెయింట్ పాల్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో నిర్వహించిన పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం మరియ జోసెఫ్ మాట్లాడుతూ సెయింట్ పాల్స్ పాఠశాలలో విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే వివిధ పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచి మరిన్ని మెడల్స్ అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా పరికరాల వితరణ



నర్మెట, మార్చి17(ఆంధ్రజ్యోతి): హన్మంతాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.1.50 లక్షల విలువైన క్రీడా పరికరాలను వైటెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ఆసియా సంస్థ ఉద్యోగులు సోమవారం అందించారు. హెచ్‌ఎం దూడల రమేష్ మాట్లాడుతూ పేద విద్యార్థుల అభ్యున్నతికి కోసం కృషి చేసిన ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి జొన్నాల శ్రీనివాస్‌గుప్తా, ఉపాధ్యాయులు గుర్రాల కర్ణాకర్‌రెడ్డి, సీఆర్పీ రవీందర్ పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం

నర్మెట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బొమ్మకూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మెరుగు రామరాజు, ఉపాధ్యాయుడు రాజాకిరణ్ పాల్గొన్నారు.



రూ.800కోట్ల ఇచ్చారంటే ఎవరూ నమ్మరు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, రైతు భరోసాను పూర్తిగా అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి రూ.800కోట్ల మంజూరి చేశారంటే ప్రజలు నమ్మేస్థితిలో లేరని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని, అన్ని ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయాలన్నారు. సీఎం మాటలతో గారడీ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడని తెలిపారు. 15ఏళ్లలో కడియం మంత్రిగా, ఎమ్మెల్సీగా పని చేసిన ఆయన ఘన్‌పూర్ అభివృద్ధిని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు గోనెల శ్రీనివాస్, రడపాక ప్రదీప్, సారయ్య, కుమ్మం సతీష్, శివకృష్ణ, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బుచ్చయ్య, శివకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఇఫ్తార్ విందు



దేవరుప్పుల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కామారెడ్డి గూడెంలోని మసీదులో సోమవారం మహ్మద్ గోరేసాబ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మత గురువు ఇనాయత్ రసూల్ మాట్లాడుతూ ముస్లిం ఆచార సంప్రదాయం ఆచరిస్తూ సమాజం కోసం పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో ముస్లీం మత పెద్దలు గులాం రసూల్, జాకీర్, రబ్బానీ, శబ్బీర్, అబ్బాస్, ఖలీల్, కాజా, పాషా, పెద్ద కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శ్రీరామ నవరాత్రోత్సవాలకు అంకురార్పణ

జనగామ కల్చరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నవరాత్రోత్సవాలకు సోమవారం అంకురార్పణ చేశారు. జనగామలోని పాత బీటు బజారులో పట్టణ పురోహితులు అప్పయ్య శాస్త్రి నేతృత్వంలో గణపతి పూజ అనంతరం పందిరి స్తంభ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పజ్జూరి గోపయ్య, మహంకాళి హరిశ్చంద్ర గుప్తా, పోకల లింగయ్య, పజ్జూరి జయహరి, అయితా శ్రీకాంత్, పోకల వేణు, నందు బజాజ్, సోమ హనుమంతరావు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కనకారెడ్డి

రైతుల గోస పట్టించుకోని సీఎం

జనగామ రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి రైతుల గోస పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మండిపడ్డారు. సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కనకారెడ్డి మాట్లాడారు. ఎన్నికల ముందు వరంగల్ డిక్లరేషన్‌లో పొద్దున లేవగానే రైతుల గురించి మాట్లాడకుండా తాను ఉండలేనని గొప్ప చెప్పి ఎన్నికల్లో గెలుపొందాక రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్టేషన్ ఘన్‌పూర్ సభలో ఎండిన పంటల గురించి సీఎం ఒక్కమాట మాట్లాడకపోవడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, జోగు ప్రకాశ్, పుత్కనూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

డోర్నకల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ -మహబూబాబాద్ రైల్వే సెక్షన్‌లో గుండ్రాతిమడుగు స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుండ్రాతిమడుగు సమీపంలో రైలు పట్టాల కింద మృతదేహాన్ని గమనించిన రైలు కీమెన్ గుండ్రాతిమడుగు స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. ఆయన ఈ విషయాన్ని డోర్నకల్ జీఆర్పీ పోలీసులకు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35ఏళ్ల వరకు ఉండవచ్చునని జీఆర్పీ పోలీసులు చెప్పారు.

సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ల ప్రారంభం



బ్రేకర్లను ప్రారంభిస్తున్న డీఈ లక్ష్మీనారాయణ రెడ్డి

లింగాలఘణపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సోమవారం లింగాలఘణపురం మండలం జీడికల్ 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన నూతన బ్రేకర్లను డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ నూతన బ్రేకర్ల ఏర్పాటుతో సిరిపురం, గుమ్మడవెల్లి, జీడికల్, జీడికల్ టౌన్ తోపాటుగా గ్రామాలకు వ్యవసాయానికి, గృహోపయోగ విద్యుత్‌లో లోవోల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ అనిల్‌కుమార్, ఏఈ శంకరయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే ఉన్నా : మాజీ ఎమ్మెల్యే ఆరోగ్యం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తాను ఇప్పటికీ, ఎప్పటికీ కాంగ్రెస్ వాదినేనని, పార్టీలోనే ఉన్నానని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే బొనగిరి ఆరోగ్యం స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్‌కు విచ్చేసి బహిరంగ సభలో పాల్గొన్న సందర్భంగా ఆరోగ్యం సీఎంకు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ చిత్ర పటాన్ని బహూకరించారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పక్షాన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న విషయాన్ని ఆరోగ్యంతో ప్రస్తావించగా సోమవారం మాట్లాడారు. ఎన్నికల ప్రచార సభకు ఒకరు ఆహ్వానిస్తే వెళ్లాలని, అధికారికంగా బీఆర్‌ఎస్‌లో చేరలేదన్నారు. 1989 నుంచి 1994 వరకు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ టికెట్‌పై గెలిచానని, ఎమ్మెల్యేగా ఐదేళ్ల విజయవంతంగా పని చేశానన్నారు. చివరి వరకు కాంగ్రెస్‌లోనే ఉంటానన్నారు.



సీఎంకు రాజీవ్ చిత్ర పటం బహూకరిస్తున్న ఆరోగ్యం

రేపు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పర్యటన



హనుమకొండ టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవన్నపేటలోని ఫేస్ త్రీలో ఏర్పాటుచేసిన పంప్ హౌస్ మోటార్లను ఈ నెల 19న రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రారంభించనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8.45 నిమిషాలకు మంత్రి పంప్ హౌస్ మోటార్‌ని ప్రారంభిస్తారని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

జఫర్‌గఢ్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : తమ్మడపల్లి(జి)లో ఇటీవల మృతి చెందిన గాదె యాదగిరి కుటుంబీకులను స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి సోమవారం పరామర్శించి ఓదార్చారు. కుటుంబీకులకు ఆయన రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.యాకయ్య, మాచర్ల మహేందర్, గుండెబోయిన సతీష్, నక్క అజయ్, గాదె సంపత్, అన్నెపు కుమారస్వామి, గాదె లక్ష్మణ్, పాక చిరంజీవి, నాగేశ్, సంతోష్ పాల్గొన్నారు.

క్రైం బాక్స్



బెల్లం పానకం ధ్వంసం

దేవరుప్పుల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బంజారా గ్రామానికి చెందిన బానోత్ స్వేత ఇంట్లో సోమవారం 200లీటర్లు బెల్లం పానకం ధ్వంసం చేసినట్టు దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. 20కేజీలు పట్టిక, 50కేజీలు బెల్లం, 2లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. నిర్వాహకురాలు స్వేతపై కేసు నమోదు చేశామని, గుడుండాను తయారు చేసినా, విక్రయించిన కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిలుపూర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పల్లగుట్ట పరిధిలోని మారెపల్లి గూడెం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ సోమవారం తెలి పారు. ఆయన కథనం ప్రకారం. మండలంలోని మల్కాపూర్‌కు చెం దిన చొప్పరి కుమారస్వామి తన ట్రాక్టర్‌తో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం లోని కొత్తపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను ఆదివారం అర్ధరాత్రి తర్వాత తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని, అతనిపై కేసు నమోదు చేశారు.

పీఏసీఎస్ సభ్యత్వాలకు దరఖాస్తుల స్వీకరణ

బచ్చన్నపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీఈవో బాలస్వామి తెలిపారు. సోమవారం మాట్లాడుతూ మండల పరిధిలో 7వేల మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారని తెలిపారు.

కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు రూ.550 చెల్లిం చాలని, గతంలో సభ్యత్వం ఉన్నవారు రూ.250 చెల్లించి రెన్యువల్ చేసు కోవాలన్నారు. ఆధార్‌కార్డు, పాస్ పుస్తకం జిరాక్స్, వన్‌బీ, మూడు ఫొటోలు అందించాలని వివరించారు.

ఫటాఫట్



అధికారులకు ఎండిన పంట వివరాలు

విద్యాకర్‌రెడ్డి, వ్యవసాయాధికారి బచ్చన్నపేట

ఆంధ్రజ్యోతి : మండల పరిధిలో సాగు ఎంత, అందులో వరి ఎంత?

ఏవో: 44వేల ఎకరాల సాగుకు యోగ్యమైన భూమి ఉండగా, 24వేల ఎకరాల్లో వరి సాగు చేశారు.

ఆంధ్రజ్యోతి : ఎండిన పంటలపై సర్వే చేశారా?

ఏవో : ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎండిన పంట వివరాలు సేకరించి సంబంధించిన అధికారులకు పంపుతున్నాం.

ఆంధ్రజ్యోతి: డిజిటల్ క్రాప్ సర్వే ఎంత వరకు వచ్చింది ?

ఏవో: మండలంలోని ఏడు క్లస్టర్‌ల్లో ఒక గ్రామం చొప్పున ఏడు గ్రామాలను ఎంపిక చేసుకుని డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని నిర్ణయించాం. బచ్చన్నపేట, పోచన్నపేట, కొన్నె, కేశిరెడ్డిపల్లి గ్రామాలకు సంబంధించిన డిజిటల్ మ్యాప్ రాకపోవటంతో నిలిచిపోయింది. మిగతా మూడు గ్రామాల్లో పూర్తి చేశాం.

ఆంధ్రజ్యోతి: రైతుబంధు, రుణమాఫీ వివరాలు చెబుతారా?

ఏవో: మూడు ఎకరాల వరకు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రైతుభరోసా కింద డబ్బులు జమ చేశారు. రుణ మాఫీ, రైతుభరోసాకు సంబంధించి లబ్ధి పొందినరైతుల వివరాలు సేకరిస్తున్నాం.

-బచ్చన్నపేట (ఆంధ్రజ్యోతి)